క్లుప్తంగా

ఎన్నికల రిసెప్షన్ కేంద్రం పరిశీలన



ఎన్నికల రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఏలూరు అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లలో భాగంగా స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ గురువారం పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి అవసరమైన స్టాల్స్, బస్సు రూట్లు, ఎన్నికల సిబ్బందికి ఫుడ్ కోర్టు, ఈవీఎంలు భద్రపరచు స్ట్రాంగ్ రూమ్‌లు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లకు సంబంధించి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసరావు, దిశానిర్దేశం చేశారు. ఎన్నికల పోలింగ్ మెటీరియల్ పంపిణీలో సమస్యలు తలెత్తకుండా ముందు నుంచే పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కళాశాల ఆవరణం అంతా పరిశుభ్రం చేయించి, లెవెలింగ్ పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. తరగతి గదుల్లో ఉన్న సామగ్రిని వేరే చోటికి తరలించి గదులను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్, తాగునీరు, బారికేడ్స్, షామియానాలు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాటు పనులు ప్రారంభించాలని ముక్కంటి, వెంకటకృష్ణలను కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో ఇంటర్మీడియేట్ డీఈసీ బి.ప్రభాకరరావు, తహసీల్దార్ వి.మురార్జీ, మండల సర్వేయర్, ఇతర కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణ ఆశయాలను సాధిద్దాం



వెంకటరమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : వడ్రంగి పనివార్ల సంక్షేమం, వృత్తి సంరక్షణకు అనేక పోరాటాలు చేసిన మహనీయుడు ఏలూరు వడ్రం పనివార్ల సంక్షేమం సంఘం అధ్యక్షుడు కెల్ల వెంకటరమణ అని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాట్నూరి శివరాం, కెల్లా దుర్గాప్రసాద్‌లు కొనియాడారు. స్థానిక పవరుపేటలోని సంఘ భవనంలో గురువారం ఏర్పాటుచేసిన వెంకటరమణ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. వెంకటరమణ ఆశయాల సాధనకు ప్రతి సంఘీయుడూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

పోణంగి.. అన్నింటా అభివృద్ధి

- రూ. కోట్లతో సౌకర్యాల కల్పన
- వంతెన నిర్మాణంతో విస్తరిస్తున్న గ్రామం



ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పనతో ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైన పోణంగి గ్రామ స్వరూపమే మారిపోయింది. గత ప్రభుత్వ హయాంలో దారి, నీరు లేక అల్లాడిన ప్రజలు నేడు సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యంతో ఆనందంగా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, పింఛన్ తదితర పథకాలు పేద, మధ్య తరగతి ప్రజలకు దన్నుగా నిలిచాయి. 2019 నుంచి 2024 వరకు సుమారు 25కు పైగా సంక్షేమ పథకాల ద్వారా సుమారు 3 వేల మంది బడుగు, బలహీన వర్గాల ప్రజలు లబ్ధి పొందారు. వీరిలో 360 మంది అమ్మఒడి ద్వారా రూ.54 లక్షలు పొందారు. వైఎస్సార్ చేయూత ద్వారా 209 మంది రూ.99.18 లక్షలు అందుకున్నారు. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా పేదలు రూ.21.20 లక్షలు అందుకుని జీవనోపాధి పెంపొందించుకున్నారు. ఇలా వైఎస్సార్ సీపీ హయాంలో రూ.9,87,12,734 వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందారు.

పుష్కలంగా సాగునీరు

పోణంగిలో ఈ ఐదేళ్లగా కృష్ణ ఆయుకట్టు ద్వారా సాగునీరు పుష్కలంగా అందించింది. ఫలితంగా సుమారు 2 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు సిరులు పండిస్తున్నారు. తమ్మిలేరు వద్ద గేట్లు ఏర్పాటుచేసి వరదనీరు సైతం సాగు భూములకు మళ్లించారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం 454 మంది రైతులకు ఐదేళ్ల పాటు రూ.1,12,29,000 అందించింది. రూ.25 లక్షలు ఖర్చు చేసి ఆర్‌బీకే కేంద్రం నిర్మించారు. ఇక్కడ నుంచే రైతులు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, యంత్రాలు అందించారు.

తమ్మిలేరుపై వంతెన నిర్మాణం

వైఎస్సార్ కాలనీ వద్ద తమ్మిలేరుపై సుమారు వందేళ్ల క్రితం ఇక్కడ నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వరదల సమయంలో నీటి మునిగిపోయేది. ఐనా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2 కోట్లతో వంతెన నిర్మించి సమస్యకు చెక్ పెట్టింది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పరిసర భూములు రియల్ ఎస్టేట్‌గా మారుతున్నాయి. క్రమేపీ పోణంగి విస్తరిస్తోంది.



పోణంగి తమ్మిలేరు వద్ద రూ.2 కోట్లతో నిర్మించిన వంతెన



పోణంగి ఎస్సీకాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



పోణంగిలో నిర్మించిన సచివాలయం



పోణంగి రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్న ఎరువులు

అభివృద్ధిపై ఆనందం



గత ప్రభుత్వ హయాంలో ఒక్క అభివృద్ధి కూడా జరగలేదు. ఎమ్మెల్యే ఆళ్ల నాని కృషి వల్ల గ్రామ స్వరూపం మారిపోయింది. రూ.2 కోట్లు ఖర్చు చేసి తమ్మిలేరుపై వంతెన నిర్మించారు. దీనికి తోడు సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలు నిర్మించారు. అభివృద్ధి పనులపై ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయకత్వంపై పోణంగి ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి సీఎం కావాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

– దారపు తేజ అనూష

అర్హులందరికీ పథకాలు



ఎమ్మెల్యే ఆళ్ల నాని చొరవ వల్ల పోణంగిలో వైఎస్సార్ కాలనీ ఏర్పాటైంది. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి కాలనీలో రోడ్లు, విద్యుత్, వాటర్ సరఫరా చేస్తోంది. వేలాది కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుంటున్నాయి. పోణంగిలో ప్రతి కుటుంబంలో ఒకరు లేక ఇద్దరు సంక్షేమ పథకాలు అందుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 20 ఏళ్ల సంక్షేమ పాలన అందిస్తారనే నమ్మకం ఉంది.

– మంచెం మైబాబు

మెరుగైన సేవలు అందించాలి



వన్‌స్టాఫ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న రత్నప్రసాద్, ఉమాసునంద

ఏలూరు (టూటౌన్): వన్‌స్టాఫ్ సెంటర్‌కు వచ్చే బాధిత మహిళలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, పోక్సో కోర్టు జడ్జి ఎస్ ఉమాసునంద అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని వన్‌స్టాప్ సెంటర్‌ను గురువారం వారు సందర్శించారు. అంతరింగిక శిక్షణలో భాగంగా వన్‌స్టాప్ సెంటర్‌ను జడ్జీలు సందర్శించారు. సెంటర్ పని విధానం, రికార్డులను పరిశీలించారు. బాధితుల వివరాల ఆన్‌లైన్ చేసి, కేసుల కౌన్సిలింగ్, న్యాయ సాయం, వైద్య సదుపాయాలు తదితర విషయాలపై ఆరా తీశారు. అక్కడ ఉన్న బాధితులకు న్యాయమూర్తుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో అడ్మిన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మజ్జిగ పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సెయింట్ గ్జేవియర్ ఉన్నత పాఠశాలలో డీఈఓ ఎస్ అబ్రహాం ప్రారంభించి మాట్లాడారు. తోటి ఉపాధ్యాయుల వేసవి తాపాన్ని తీర్చడానికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్‌వీకే రాజ్‌కుమార్ మాట్లాడుతూ తమ సంఘ సభ్యుల సహకారంతో మజ్జిగ పంపిణీ చేయడం గర్వకారణమన్నారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎల్ శ్రీకాంత్, డిప్యూటీ క్యాంపు అధికారి బుధ వ్యాస్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సతీష్, ఆర్ శ్యాంసుందర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న అబ్బారెడ్డి నాగేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణ హిత జీవనం గడపాలని ప్రముఖ ఆర్కిడాలజిస్ట్ పద్మశ్రీ డాక్టర్ అబ్బారెడ్డి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏలూరు నగరంలోని ఏకో క్లబ్ పాఠశాలల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో పర్యావరణ విద్యపై స్థానిక కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆహార వృథాను తగ్గించాలని, పర్యావరణ పరిరక్షకులుగా ఎదగాలని అన్నారు. ఇళ్ల పరిసరాల్లో సేంద్రియ ఎరువులతో కూరగాయలు పండించి ఆహారంగా తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం పొందవచ్చని వివరించారు. గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు వివిధ పర్యావరణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డాక్టర్ నాగేశ్వరావు చేతుల మీదుగా అందించారు. పర్యావరణహిత మార్పులతో కూడిన జీవన విధానాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కస్తూరిబా బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.సునీత అధ్యక్షత వహించగా ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ డివిజనల్ సమన్వయకర్త ఎస్.మధుసూదన్ రావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆళ్ల నాని ప్రచారం



50వ డివిజన్ ప్రచారంలో చిన్నారిని ముద్దాడుతున్న ఎమ్మెల్యే నాని చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని గురువారం ఉత్సాహంగా ప్రారంభించారు. వీవీ నగర్, ట్రాక్ రోడ్డు, మార్కెట్ యార్డ్ రోడ్డులో ప్రతి ఇంటికీ వెళ్లి 59 నెలల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పాలన, అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందించామో తెలిపారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడేందుకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ క్లస్టర్–3 పార్టీ అధ్యక్షుడు మంచెం మైబాబు, క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు నున్న స్వాతిశ్రీదేవి, క్లస్టర్–3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి, క్లస్టర్–1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి, కార్పొరేటర్ కిలాడి జ్యోతి, కార్పొరేటర్లు పొలిమేర దాసు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, బీసీ సెల్ నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలచారి, మహిళా సమాఖ్య టూటౌన్ అధ్యక్షురాలు అమీనా అన్సారీ, మున్నీ, లీగల్ సెల్ ప్రత్తిపాటి తంబి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్‌వీ శివరావు, యువజన నగర అధ్యక్షులు నిడికొండ నరేంద్ర, సేవాదళ్ అధ్యక్షుడు యల్లాపు మోజెస్, ఎస్సీ సెల్ నగర వైస్ ప్రెసిడెంట్ బండ్లమూడి సునీల్‌కుమార్, పిట్టా ధనుంజయ్, స్థానిక నాయకులు పగిడిపోగు దేవయ్య, చుండూరి వీరబాబు, దర్శనం ఏసుబాబు, సీహెచ్ కిరణ్, నల్లగడ్డ అనిల్‌కుమార్, వినుకొండ మల్లేశ్వరరావు, చిలుకూరి మరియదాసు, శేఖర్, ఇమ్మానియేల్, భారీ సంఖ్యలో మహిళలు, యువత, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

జగన్‌కు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో జగన్ సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. గురువారం నుంచి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన నాని, వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌లకు ఆ పార్టీ లీగల్ సెల్ నాయకులు క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ జగన్ ప్రభుత్వం సంక్షేమ పాలనను నిరాటంకంగా కొనసాగించిందని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతానికి పైగా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను తొలి నుంచీ టీడీపీ, జనసేన పార్టీలు తమ అనుకూల మీడియాతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని, అవ్వా, తాత, వితంతు, వికలాంగులకు ఇచ్చే పింఛన్లు వాలంటీర్ల ద్వారా ఇవ్వడానికి వీలు లేదని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు కోర్టులో కేసులు వేశారని వివరించారు. మరోవైపు టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేయాలంటూ అధికారులకు లేఖలు రాసి మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఏలూరు నియోజకవర్గంలో తన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తాను గతం కంటే భారీ మెజారీతో విజయం సాధిస్తానని నాని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ ప్రసాదరావు, రంజన్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పితాని దుర్గాప్రసాద్, డీవీ రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు లక్ష్మణ్, సాంబ, న్యాయవాదులు పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే నాని



ఎమ్మెల్యే నానిని కలిసిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.50 లక్షల విరాళం



దాత రాముకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు గురువారం వేరువేరుగా రూ. 1,50,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ఏలూరుకు చెందిన నెమల రాము రూ. 1,00,116, లింగపాలెం మండలం కలరాయనగూడెంకు చెందిన ఎం.వెంకట సత్యన్నారాయణ రూ. 50,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించి, శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	72
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05,07
బెండకాయలు	20	కంద	70
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	24–28	కీరా దోస	34
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	76
బీరకాయలు (పందిరి)	40	అల్లం	170
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30–40	పాలకూర	10
దొండకాయలు	20	చుక్కకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	25
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	41
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు –తిరుపతి	16.00	4830	34

నేడు తంగెళ్లమూడిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు రూరల్ : తంగెళ్లమూడి సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలిగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీజీ నటరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఆర్‌సీ కాలనీ, రత్నస్ హోటల్, బైపాస్ రోడ్డు, క్రాంతి నగర్, లక్ష్మీనగర్, బీడీ కాలనీ, లునానీ నగర్, జేఎంజే స్కూల్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కొక్కిరపాడులో పోలీసు కవాతు

పెదపాడు : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకారం అవసరమని ఎస్సై శుభశేఖర్ అన్నారు. పెదపాడు మండలం కొక్కిరపాడు గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమావేశాలు, సభలకు అనుమతులు తీసుకోవాలని సూచించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీ

ఏలూరు(మెట్రో): కాంట్రాక్ట్ పద్ధతిలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు డేటా ఎంట్రీ ఆపరేటర్‌ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. మూడు ఆపరేటర్ పోస్టులను భర్తీ చేస్తామని, జిల్లా ఎన్నికల అధికారి ఏలూరు, రిటర్నింగ్ అధికారి, ఏలూరు కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. కంప్యూటర్ సబ్జెక్టుగా డిగ్రీ పాస్ లేదా ఏదైనా డిగ్రీతోపాటు కంప్యూటర్ సర్టిఫైడ్ కోర్సు పూర్తి చేసిన 18 నుంచి 42 ఏళ్ల వయస్సున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలవారు ఈనెల 8న సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి వద్ద హాజరు కావాలన్నారు. వారి వెంట ఒరిజినల్, జెరాక్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. ఏలూరు నగర అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తామన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

గణపవరం: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గోనె సంచులు సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. గణపవరం మండలం చిలకంపాడులో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలులో అనుసరించాల్సిన పద్ధతులు, ధాన్యం నాణ్యతా పరిశీలన తదితర విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ శివరామ్, ఏడీఏ పి.మురళీకృష్ణ, తహసీల్దార్ రాంబాబు, ఎంఎల్‌ఓ దాసు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.